క్లుప్తంగా

వేలం పాటలో పెరిగిన ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి పుణ్య క్షేత్రంలో వివిధ రకాల అంగళ్ల నిర్వహణ కోసం గురువారం ఈఓ మోహన్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఈ ఏడాది రూ.27వేలు అదనపు ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. గతేడాది అంగళ్ల బహిరంగ వేలంపాటలో రూ.2,89,000 రాగా, ఈ ఏడాది రూ.3,16,000 పాటదారులు దక్కించుకోవడంతో రూ.27వేలు ఆదాయం పెరిగిందన్నారు. వేలం దక్కించుకున్న వారు ఈఏడాది మే 19 నుంచి 2024 మే, 18 తేదీ వరకు దుకాణాలు నిర్వహించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల ఈఓ టి.రామాంజనేయులు, సర్పంచు ఎర్రం చంద్ర శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'స్పందన' నిర్వహించాలి

కొత్తపల్లి: అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించి, దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఏఏ గ్రామాల నుంచి ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి, ఎంతమంది ప్రజలు స్పందనను సద్వినియోగం చేసుకుంటున్నారన్న విషయాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని సూచించారు.కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు,పంచాయతీకార్యదర్శులుపాల్గొన్నారు.

రైస్ మిల్లు కోటేశ్వరరావు మృతి

వెలుగోడు: మోతుకూరు గ్రామంలోని గణపతి రైస్‌మిల్లు యజమాని కే.కోటేశ్వరరావు (75) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మేడిమేల సుధాకర్ రెడ్డి, ఎం నాగేశ్వర్ రెడ్డి, బోగోలు సుదర్శనం, ఆర్యవైశ్యులు అక్కడికి చేరుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు నాయకులు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సిద్ధార్థరెడ్డిని విమర్శించే అర్హత ముస్తఫాకు లేదు



మాట్లాడుతున్న అబుబక్కర్

నందికొట్కూరు: శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ నాయకుడు మోమిన్ ముస్తఫాకు లేదని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ (ఉమ్మడి జిల్లా) అబుబక్కర్ అన్నారు. గురువారం పట్టణంలోని హాజీనగర్‌లో 27వ వార్డు కౌన్సిలర్ సమీరాబాను స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రాష్ట్రాల్లో అభిమానులను సంపాందించుకున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని వార్డు మెంబర్‌గా గెలవని మోమిన్ ముస్తఫా విమర్శించడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బార్, కౌన్సిలర్లు అబ్దుల్ హమీద్, షేక్ నాయబ్, రవూఫ్, కిరాణం మన్సూర్, ఉస్మాన్ బేగ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

'420 రాజకీయాలు మానుకోవాలి'

పగిడ్యాల: టీడీపీ నాయకులు 420 రాజకీయాలకు తెరతీయడం మానుకోవాలని నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు టీడీపీ అధికార ప్రతినిధి మొమిన్ ముస్తఫాకు హితవు పలికారు. గురువారం పడమర ప్రాతకోటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాప్ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పట్ల మొమిన్ ముస్తఫా అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ దివాన్‌సాహెబ్, పీఎంసీ చైర్మన్ సిలార్‌సాహెబ్, నాయకులు రమణప్రసాద్, కురువ మల్లయ్య, అలీబాషా, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కొడవలితో దాడి

వెలుగోడు: మహిళపై సమీప బంధువు కొడవలితో దాడి చేసి గాయపరిచిన ఘటన వెలుగోడు పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగన్ మోహన్ కథనం మేరకు వివరాలు ఇలా.. స్థానిక బాషా నగర్‌కు చెందిన శివుడు కుమారుడు సమీప బంధువుల అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఇది నచ్చని శివుడు అమ్మాయి తల్లిపై కొడవలితో దాడి చేయడంతో తలకు గాయమైంది. బంధువులు వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో 'ఆదర్శం'

- ఉత్తమ ఫలితాలు సాధించిన మోడల్, గురుకుల పాఠశాల విద్యార్థులు



నందిని (966), అలివేలి (958), కీర్తిశ్రీ (948),



గాయిత్రి (948), పరశురాముడు (948), తరుణ్ (927)



ఏ. శ్వేత(939), పి. పూజిత(911), కే. సంధ్యా(865), పి. భానుప్రకాష్(437), పి. సుకన్య(397)

జూపాడుబంగ్లా: రెండు రోజుల క్రితం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో జూపాడుబంగ్లా మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. మోడల్ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 10 మందికి గాను ఏడు గురు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. వారిలో కె. నందిని 966 మార్కులు సాధించి టాప్‌పొజిషన్‌లో నిలిచింది. అలివేలి 958 మార్కులు, కీర్తిశ్రీ 948 మార్కులు సాధించింది. బైపీసీ గ్రూపులో 28 మందికి గాను 22 మంది ఉత్తీర్ణులు కాగా వారిలో బి గాయత్రి 948 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరం ఇంటర్ 54 మందికిగాను 24మంది ఉత్తీర్ణులయ్యారు.

గురుకుల పాఠశాలలో

గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ ఏడాదిలో బైపీసీలో 31 మందికి గాను 17 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఎంపీసీలో 30 మందికిగాను 25మంది పాసయ్యారు. వారిలో ఎంపీసీ గ్రూపులో పరశురాముడు 948 మార్కులు, తరుణ్ 927 మార్కులు, బైపీసీలో భరత్ 937 మార్కులు సాధించారు.

కస్తూర్బా పాఠశాలలో

కస్తూర్బా పాఠశాలలో ప్రథమ ఏడాది ఇంటర్ బైపీసీ గ్రూపులో 31మందికిగాను 15 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌ఓ యశోద తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలికలదే పైచేయి

పగిడ్యాల: ఇంటర్ పరీక్షా ఫలితాలలో బాలుర కంటే బాలికలే పై చేయి సాధించారు. ఆదర్శ పాఠశాలలో 66 శాతం ఉత్తీర్ణత సాధించగా, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 78.72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ సుజనకుమారి, వెంకటరమణమ్మ తెలిపారు. అయితే ఈ ఏడాది జూనియర్ కళాశాలగా ఎంపీపీ గ్రూప్ పెట్టి అప్‌గ్రేడ్ చేసిన కస్తూర్బా బాలికల విద్యాలయంలో మాత్రం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కోర్సులో 13 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా ఒక్కరే పాసైనట్లు ప్రత్యేక అధికారిణి జరీనా వెల్లడించారు.

అంబేడ్కర్ గురుకులంలో 43 మంది పాస్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం చదివే పిల్లలు 74 మంది పరీక్షలు రాయగా 43 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఎంపీసీలో లతాశ్రీ -415మార్కులు , బైపీసీలో మేఘన 427 మార్కులతో కళాశాల టాపర్‌లుగా నిలిచారు. అలాగే సెకెండియర్ పరీక్షలకు 77 మంది హాజరు కాగా 56 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో శిరిష 952 మార్కులు , బైపీసీలో రాణి 949 మార్కులు టాప్ స్కోరర్‌గా నిలిచారు. ఇంకా ఆదర్శ పాఠశాలలో ఫస్టియర్ పరీక్షలకు 37 మంది హాజరు కాగా 19 మంది ఉత్తీర్ణత సాధించి 51 శాతం నమోదు చేశారు. అలాగే రెండో సంవత్సరం పరీక్షలు 50 మంది రాయగా 33 మంది పాసై 66 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఎంపీసీ పరీక్షల్లో భానుప్రకాష్ 437, బైపీసీలో సుకన్య 397 మార్కులు సాధించి కళాశాల టాపర్లు కాగా, సెకెండియర్ ఎంపీసీలో శ్వేత 939, పి. పూజిత బైపీసీలో 911 , సీఈసీలో కే. సంధ్యా 869 మార్కులు సాధించారు.

ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

వెలుగోడు: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. సీనియర్ ఇంటర్లో 838 మార్కులతో సమ్రీన్ , అయేషా 816 ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని, ముషారాకు 800 మార్కులు వచ్చాయని చెప్పారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఫలదౌలత్ 415 మార్కులు, సయ్యద్ తన్వీర్ జాకీరా 374 మార్కులు, షేక్ రుక్సానా 336 మార్కులు సాధించినట్లు చెప్పారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మద్దూరు సుభాస్ చంద్రబోస్

నందికొట్కూరు: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు మద్దూరు సుభాస్ చంద్రబోస్ అన్నారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 60 గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రూ. లక్షలు వెచ్చించి అన్ని రకాల పుస్తకాలను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. గ్రంథాలయాల్లో చదువుకొని ఎందరో కలెక్టర్లు, ఎస్పీలు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు అయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మురళి, జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. అభిషేకాది, అర్చనలు, ప్రసాద వితరణ గావించారు.

గ్రామపెద్దల నియామకంపై అభిప్రాయ సేకరణ

- జేసీ నిశాంతి ఆధ్వర్యంలో గ్రామసభలు



తర్తూరు గ్రామసభలో గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ నిశాంతి

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామంలో పెద్ద మనుషుల నియామకంపై మానవహక్కుల కమిషన్ ఆదేశాల మేరకు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అధ్యక్షతన జేసీ నిశాంతి గురువారం గ్రామసభను నిర్వహించారు. ముందుగా గ్రామపెద్దలుగా ఉండేందుకు ఎవరెవ్వరు ఆసక్తి కనపర్చుతున్నారో వెల్లడించాలని జేసీ కోరారు. దీంతో జంబన్న, సుంకిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, భాను ప్రతాపరెడ్డి, సంజన్న అనే ఆరుగురు వ్యక్తులు ఆసక్తి కనబరుస్తున్నట్లు జేసీకి తెలిపారు. కాగా వారికి ఎంత మంది మద్దతిస్తున్నారో తెలపాలని కోరగా గ్రామస్తులు చేతులు ఎత్తి వారికి మద్దతు ప్రకటించారు. ఇంకా ఎవరైనా గ్రామపెద్దగా ఉండేందుకు ఆసక్తి కనపర్చుతున్నారా అని అడగ్గా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో కేవలం ఆరుగురు మాత్రమే ముందుకు వచ్చినందున వారిని గ్రామపెద్దలుగా ఉండేలా చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ఓ వర్గం వారు కల్పించుకొని గ్రామపెద్దలుగా కేవలం నలుగురు మాత్రమే ఉండాలని, ఆరుగురిలో మెజార్టీ వచ్చిన వారిని మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. అందుకు జేసీ ఆరుగురు ఉండటం వల్ల గ్రామస్తులకు ఏమైనా ఇబ్బందా అని అడగ్గా ఎవరూ సమాధానం చెప్పలేదు. దీంతో ఆరుగురు గ్రామపెద్దలుగా ఉండేలా చేస్తున్నామని జేసీ ప్రకటించారు. దీంతో ఓ వర్గం వారు గ్రామసభను బహిష్కరించారు. గ్రామసభలో తన సమక్షంలో ఏమిజరిగిందో వాటిని మానవహక్కుల కమిషన్‌కు నివేదిస్తానని జేసీ నిశాంతి గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసు, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి, కలెక్టర్ కార్యాలయ తహసీల్దార్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు సీఐ సుబ్రమణ్య అధ్వర్యంలో ఐదు మంది ఎస్‌ఐలు, 20మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 20మంది సివిల్‌పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మిడుతూరులో కుదరని ఏకాభిప్రాయం

మిడుతూరు: మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో జేసీ నిశాంతి ఆధ్వర్యంలో పాలాల పైకావలి గ్రామ పెద్ద మనుషుల ఏర్పాటుపై విషయమై గురువారం గ్రామసభను గ్రామ సర్పంచ్ మరియమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మాణిక్యరావు అనే వ్యక్తి గ్రామంలో గత కొన్నేళ్లుగా అగ్రవర్ణానికి చెందిన కొందరు రైతులు గ్రామ పైకావలి పెద్దమనుషులుగా కొనసాగుతూన్నారని.. అలా కాకుండా గ్రామంలోని అనిన వర్గాలకు(బీసీ, మైనార్టీ, ఎస్సీ) చెందిన రైతులతో కూడిన కమిటీని ఎన్నుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. మానవహక్కుల కమిషన్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ నిశాంతి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో అందరూ రైతులు ఐకమత్యంతో ఉంటూ ఏకాభిప్రయంతో పైకావలి సంఘం ఏర్పాటు చేసుకోవాలని జేసీ సూచించారు. అయితే ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఇరువురి వాదనలను లిఖితపూర్వకంగా అందజేయాలని, వీటిపై తుది నివేదికలను తయారుచేసి హెచ్చార్సీకి అందజేస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాసు, తహసీల్దార్ సిరాజుద్దీన్, ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, నందికొట్కూరు రూరల్, పట్టణ, ఆత్మకూరు సీఐలు సుధాకర్ రెడ్డి, విజయభాస్కర్, సుబ్రమణ్యం, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానటుడు చంద్రబాబును నమ్మొద్దు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మళ్లీ సీఎం కావాలని వైఎస్ జగనన్నను దీవించండి
- నందికొట్కూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: మహానటుడు నారా చంద్రబాబు నాయుడును నమ్మొద్దని ఎమ్మెల్యే తొగరు ఆర్థర్ అన్నారు. సోమవారం పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలో సాయిబాబాపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్ జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రజలు దీవించాలని కోరారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరారు.

అధికారంలోకి రావాలని బాబు ఎత్తుగడలు

అధికారంలోకి వచ్చేందుకు మోదీతో పొత్తు కోసం చంద్రబాబు ఆరాటపడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఏదో విధంగా అధికారంలోకి రావాలని ఎత్తుగడ్డలు వేస్తున్నారన్నారు. బీసీ కులాల ఓట్లు వేయించుకొని మోసం చేసిన చరిత్ర చంద్రబాబుకు ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్ద పీట వేశారని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సీఎం వైఎస్ జగనన్న వెంట ఉన్నారని ఓర్వలేక చంద్రబాబు విషం చిమ్ముతున్నార న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, సహకార సొసైటీ చైర్మన్ హుసేనయ్య, కౌన్సిలర్లు జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రాజు, రత్నం, అయ్యన్న, సుధాకర్‌రెడ్డి, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన కటకం లక్ష్మీనారాయణకు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు.

తండ్రి అస్థికలను కృష్ణానదిలో కలిపిన ఏలూరు డీఐజీ



తండ్రి అస్థికలతో డీఐజీ అశోక్‌కుమార్

శ్రీశైలంప్రాజెక్ట్: ఏలూరు డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తన తండ్రి అస్థికలను గురువారం శ్రీశైలం డ్యామ్ దిగువ భాగంలోని లింగాలగట్టు వద్ద కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. అశోక్‌కుమార్ తండ్రి సున్నిపెంట గ్రామ నివాసి అయిన డాక్టర్ జి.సూర్యనారాయణ. ఈయన శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ వైద్యశాలలో సుమారు 20 సంవత్సరాలు రోగులకు వైద్య సేవలు అందించారు. అశోక్‌కుమార్ కూడా ఇక్కడే చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



గౌరవవందనం సమర్పిస్తున్న సీఆర్‌పిఎఫ్ సిబ్బంది

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామాకి చెందిన నరాల. నాగోశేషారెడ్డి అనే ఆర్మీ జవాన్ (సీఆర్‌పిఎఫ్ కమాండెంట్) బుధవారం హైదారాబాద్‌లోని ఆర్మీ హాస్పిటల్‌లో మరణించిన విషయం విధితమే. ఆయన పార్థీవదేహాన్ని గురువారం గువ్వలకుంట్ల తరలించి అక్కడ హైదరాబాద్ సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నీరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో సీఆర్‌పిఎఫ్ పోలీసు సిబ్బంది ప్రభుత్వ లాంఛనాలతో ఘన నివాళులర్పించారు. నాగోశేషారెడ్డి పార్థీవ దేహాన్ని ఆయన ఇంటి నుంచి ఊరేగింపుగా శ్మశాన వాటికకు తీసుకువెళ్లారు. ఆయన మృతదేహంపై త్రివర్ణపతాకాన్ని ఉంచి అంతిమయాత్ర చేపట్టారు. అక్కడ పోలీసులు గాలిలోకి మూడురౌండ్లు తుపాకులు పేల్చి, పూలమాలలు వేసి, గౌరవ వందనం సమర్పించి దహన సంస్కారాలు చేశారు. అనంతరం రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

రూ. పది కోట్లతో ఆలయాల అభివృద్ధి

మహానంది: నంద్యాల జిల్లాలో రూ. పది కోట్లతో వివిధ ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు దేవదాయశాఖ కర్నూలు, అనంతపురం జిల్లాల డీఈ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మహానందిలో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గిద్దలూరు ఘాట్‌రోడ్డులోని శ్రీ సర్వ నరసింహాస్వామి ఆలయంలో రూ. 1.60 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేస్తున్నామని చెప్పారు. బండిఆత్మకూరు మండలం లింగాపురంలో రూ. కోటితో ఆంజనేయ, రామాలయ నిర్మాణాలు, సీతా రామాపురంలో రూ. 1.25కోట్లతో ఈశ్వర, రామాలయాలు పునర్నిర్మించనున్నట్లు వివరించారు.



వాటర్‌ప్లాంట్ పనులు పరిశీలిస్తున్న డీఈ

శ్రీలక్ష్మీరంగనాథునికి జేసీ ప్రత్యేక పూజలు

జూపాడుబంగ్లా: నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి గురువారం తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈఓ వెంకటరమణ, అర్చకులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ ఈఓ అమ్మవారి చీర, గాజులు, స్వామివారి పూలు, పసుపు, కుంకుమలతో జేసీని సత్కరించగా, అర్చకులు ఆశీర్వచనాలు పలికారు.

శ్రీశైలంలో కరెంట్ కట్

శ్రీశైలం: శ్రీశైలం మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 7.15 వరకు సుమారు 3 గంటలకు పైగా కరెంట్ లేకపోవడంతో స్థానికులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్విచ్‌యార్డ్‌లో మెయింటెనెన్స్ కోసమే కరెంట్ నిలిపివేశామని ట్రాన్స్ కో అధికారులు చెబుతున్నారు. సాధారణంగా విద్యుత్ నిలిపివేతపై ముందస్తు సమాచారం ఇస్తుంటారు. అయితే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కరెంట్ కట్ చేయడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. భక్తులు సత్రాలు, అతిథిగృహాల నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నేడు బహిరంగ వేలం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ఉన్న తాత్కాలిక దుకాణాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు వేలం నిర్వహిమన్నారు. దేవస్థాన పరిపాలన భవనం ఎదురుగా ఉన్న దుకాణాలు, గంగాధర మండపం నుంచి బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు ఉన్న దుకాణాలను కలుపుకుని మొత్తం 142 (టీఎస్ఆర్)దుకాణాలకు వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి టెండర్‌లో పాల్గొనచవ్చన్నారు.

మే డేను విజయవంతం చేయండి

ఆత్మకూరు: మే డే ఉత్సవాలను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో గురువారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రణధీర్, మల్లయ్య, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపరిరక్షణలో అర్చకుల పాత్ర కీలకం

మహానంది: హిందూ ధర్మం, సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణలో ఆలయాల అర్చకుల పాత్ర ఎంతో కీలకమని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఏపీ దేవదాయశాఖ, అర్చక ట్రైనింగ్ అకాడమి ఆధ్వర్యంలో అర్చకులకు నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారం సాయంత్రం ముగిశాయి. అర్చక అకాడమీ కో ఆర్డినేటర్ వీఎం చక్రవర్తి మాట్లాడుతూ అర్చకులు వాస్తు, జ్యోతిష్యం తదితర అంశాల్లో ప్రావీణ్యం సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందీశ్వరయ్య, వీరశైవాగమ సలహాదారుడు శశిభూషణ్ సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా హితం కోసమే కార్యక్రమాలు

పగిద్యాల: ప్రజా హితం కోసమే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని వాటిని అర్హులందరికీ అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. గురువారం మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామ సచివాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పడమర ప్రాతకోటలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి గ్రామ వలంటీర్లు కార్యక్రమానికి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుమతితో కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు.

మదార్‌వలి స్వామి ఉరుసు

మహానంది: నందిపల్లె గ్రామంలో కొలువైన శ్రీ మదార్‌వలి స్వామి గంధం, ఉరుసు వేడుకలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. కులమతాలకు అతీతంగా భక్తులు దర్గా వద్దకు చేరుకుని గంధం, చక్కెర చదివించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ప్రజలు బంధుమిత్రులను ఆహ్వానించి వేడుకను చేసుకున్నారు.

జమాలయ్యదర్గా వద్ద భక్తుల సందడి

తిమ్మాపురం సమీపంలోని జమాలయ్య దర్గా వద్ద గురువారం భక్తుల సందడి కనిపించింది. స్వామిని కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి గంధంతో అలంకరించి చక్కెర చదివించడం, జెండాలు సమర్పించారు.

క్రీడల్లో రాణించాలి

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి అన్నారు. గురువారం పాఠశాలలో క్రీడల్లో రాణిస్తున్న 20 మంది విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగేంద్ర, అతని కుమారుడు మూల శ్రీధర్ క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు మల్లికార్జున, మాదన్న, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్న పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- 21, 22 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఎమ్మెల్యేకు స్థానికుల ఘనస్వాగతం



మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: నవరత్నపథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని 21, 22 వార్డుల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అందించని పరిపాలనను ప్రజలకు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నేరుగా నవరత్న పథకాలు అందించారని చెప్పారు. బడుగు, బలహీనవర్గాలు ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంన్నారు. పట్టణంలో మంచినీటి ఎద్దడి లేకుండా సత్వర చర్యలు తీసుకుంటామని, పట్టణంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

గడప గడపకు విశేషస్పందన

పట్టణంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేషస్పందన లభించింది. కార్యాక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఎమ్మెల్యేకు గజమాలలు వేసి హారతులిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్‌సభ్యులు రషీద్, పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజగోపాల్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరానికి ఆర్థిక సాయం

మండలంలోని బాపనంతపురం గ్రామంలో ప్రార్థనా మందిరానికి ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మండలంలోని అమలాపురం గ్రామంలో పీర్ల చావిడి అభివృద్ధి కోసం రూ.50 వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. సిద్ధాపురం గ్రామంలో ప్రార్థనా మందిరానికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు ప్రారంభం

వెలుగోడు: రేగడగూడూరు గ్రామంలో హజరత్ సయ్యద్ మొహమ్మద్ జిందెషావలి రహమతుల్లా ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యే దర్గాను సందర్శించి ఫాతెహాలు సమర్పించారు. ఈ పోటీలో పది జతలు ఎద్దులు పాల్గొనగా తుమ్మలూరుకు చెందిన తెలుగు పల్లవి వృషభాలు మొదటి స్థానంలో నిలువగా ఎమ్మెల్యే శిల్పా రూ.40 వేలు బహుమతి అందజేశారు. రోలిమేడంకు చెందిన బీరం బుల్స్ రెండో స్థానంలో నిలవగా రూ.30 వేలు రేగడగూడురు గ్రామానికి చెందిన నందిరెడ్డిగారి విక్రమ్ సింహారెడ్డి అందించారు. ప్యాపిలి మండలం డి.రామాపురం గ్రామానికి చెందిన రామచంద్రుడి ఎద్దులు మూడో స్థానం దక్కించుకోగా నందిరెడ్డిగారి రామిరెడ్డి సతీమణి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ వెంకటేశ్వరమ్మ రూ.20 వేలు ప్రదానం చేశారు. అలగనూరుకు చెందిన రోలిమేడం వృషభాలకు నాలుగో బహుమతి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి రూ.12 వేలు అందించారు. ఏ.కోడురుకు చెందిన వై.శస్వీతారెడ్డి ఎద్దులకు ఐదో బహుమతిగా రూ.8 వేలు (దాతలు:అంబాల ప్రభాకర్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి) అందించారు. కాకనూరు దేరెడ్డి వర్ల బుల్స్ ఆరో బహుమతిగా రూ.5 వేలు (దాతలు:అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపంరెడ్డి)అందించారు. కన్సోలేషన్ బహుమతిగా మేకల సుదర్శనం(ఆర్.లింగందిన్నే), నాగార్జున(ఇస్కాల), దర్గయ్య(పెద్ద అనంతపురం), నాగలింగం(రేగడగూడురు) వృషభాలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.3 వేల చొప్పున యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, నాయకులు దేశం తిరూపంరెడ్డి,, నంది రెడ్డి రామిరెడ్డి, కుశాయి స్వామి రెడ్డి, వెలుగోడు సర్పంచ్ వేల్పుల జయపాల్, రామ్మోహన్ రెడ్డి, ముంతల విజయభాస్కర్ రెడ్డి, ఇలియాస్ ఖాన్ పాల్గొన్నారు.